సాక్షి
నిజామాబాద్

గురువారం, 19 జూన్ 2025



ఉత్తర్వులిచ్చారు..

జీడీ కార్మికుల జీవనభృతి కటాఫ్ తేదీ నిబంధన ఎత్తివేసినా.. ఆన్‌లైన్‌లో నమోదుకు మాత్రం ఆప్షన్ ఇవ్వలేదు.

- 8లో ▸



నగరాభివృద్ధికి కృషి చేయాలి

నిజామాబాద్ నగర అభివృద్ధికి కృషి చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డిని కోరారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.4 /24.1

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. బలమైన గాలులు వీస్తాయి. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

తాగు నీటి అవసరాలకు 'సాగర్' జలాలు



నిజాంసాగర్: నిజామాబాద్, బోధన్, బాన్సువాడ పట్టణ ప్రాంత ప్రజల తాగునీటి అవసరాల కోసం బుధవారం నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేశారు. ఇరిగేషన్ గేట్ల ద్వారా ప్రధాన కాలువకు 1,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నీటిని డిస్ట్రిబ్యూటరి తూముల ద్వారా వృథా చేయకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. బెల్లాల్ చెరువుతోపాటు అలీసాగర్ రిజర్వాయర్ వరకు 0.3 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నారు. మూడు రోజుల పాటు ప్రధాన కాలువ నీటి విడుదల కొనసాగనుంది. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8టీఎంసీలు) కాగా బుధవారం సాయంత్రం వరకు 1,393.78 అడుగుల(6.3 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

అడ్మిషన్లు, తరగతులపై దృష్టి సారించండి



నిజామాబాద్‌అర్బన్: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లతోపాటు ద్వితీయ సంవత్సరం తరగతుల నిర్వహణపై దృష్టి సారించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపుడి రవికుమార్ ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ఇంటర్ విద్య కార్యాలయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్‌లతో డీఐఈవో బుధవారం సమావేశమై సప్లిమెంటరీ ఫలితాలపై కళాశాలల వారీగా సమీక్షించారు. గతంతో పోలిస్తే ఈ విద్యా సంవత్సరం అడ్మిషన్ల సంఖ్యను 25 శాతం పెంచాలని, అధ్యాపకుల సమయపాలన, హాజరు, పనితీరుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. కళాశాలల్లో చేపట్టాల్సిన మరమ్మతులు, పాఠ్యపుస్తకాల పంపిణీ, ప్రయోగశాలల నిర్వహణకు సంబంధించి పూర్తి వివరాలు అందించాలన్నారు.

'ఇందిరమ్మ ఇండ్లు' యాప్‌పై ప్రత్యేక శిక్షణ



నిజామాబాద్ సిటీ: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలను మున్సిపాలిటీల అధికారులు 'ఇందిరమ్మ ఇండ్లు' యాప్‌లో నమోదు చేస్తున్నారు. వివరాల నమోదు, ధ్రువీకరణ పత్రాల అప్‌లోడింగ్ వంటి అంశాలపై జిల్లాలోని కంప్యూటర్ ఆపరేటర్లకు బల్దియా కార్యాలయంలో బుధవారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీల్లో కంప్యూటర్‌లో వివరాలు నమోదు చేస్తున్న ఆపరేటర్లకు మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి చిదుర రమేష్ అవగాహన కల్పించారు. రేషన్, ఆధార్‌కార్డు, ల్యాండ్ డాక్యుమెంట్లు, బ్యాంక్ అకౌంట్, కుటుంబ సభ్యుల వివరాలు ఎలా నమోదు చేయాలో హౌజింగ్ బోర్డు అధికారి హేమంత్ వివరించారు. అనంతరం నగరంలోని దుబ్బ ప్రాంతంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్న లబ్ధిదారుని వద్దకు వెళ్లి జియోట్యాగింగ్ చేసే విధానంపై క్షేత్రస్థాయిలో వివరించారు.

దోస్త్ ప్రత్యేక కేటగిరి ధ్రువపత్రాల పరిశీలన



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో దోస్త్ ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరి విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను బుధవారం పరిశీలించినట్లు కో ఆర్డినేటర్ డాక్టర్ వాసం చంద్రశేఖర్ తెలిపారు. వర్సిటీ అడ్మిషన్స్ కార్యాలయంలో ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించారు. ప్రత్యేక కేటగిరీ పీహెచ్‌సీ(దివ్యాంగులు), సీఏపీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, ఎక్స్‌ట్రా కర్య్కులర్ అక్టివిటీస్‌కు సంబంధించి ఎన్‌సీసీలో ఆరుగురు, స్పోర్ట్స్‌లో ముగ్గురు, సీఏపీలో ముగ్గురు మొత్తం 12 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయన తెలిపారు. ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ రామస్వామి, వర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ బీఆర్‌నేత, అసిస్టెంట్ నరేశ్, రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త కలెక్టర్‌కు పాత సవాళ్లు

- ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అంశాలు ఎన్నో..
- టాస్క్‌గా మారిన 44 మంది డిఫాల్ట్ మిల్లర్ల నుంచి రూ.250 కోట్ల సీఎంఆర్ రికవరీ
- ఇందూరు నగరపాలకం అస్తవ్యస్తం.. ఇన్‌చార్జి అధికారులతో నెట్టుకొస్తున్న వైనం
- ఆక్రమణలతో కుచించుకుపోయిన పులాంగ్ వాగు
- విద్య, వైద్య శాఖల్లో సమస్యలు.. ఉపాధ్యాయుల, వైద్యుల గైర్హాజర్లు



జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి పాత సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. వీటిలో చాలా సమస్యలు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నవి సైతం ఉన్నాయి. కొన్ని అంశాలైతే సమస్యల కన్నా సవాళ్ల మాదిరిగా ఉన్నాయి. కలెక్టర్ వీటిపై ప్రత్యేక చొరవ చూపి పరిష్కరిస్తేనే తన మార్క్ చూపించుకున్నట్లవుతుందని పలువురు పేర్కొంటున్నారు.



కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కస్టమ్ మిల్లింగ్ రైస్ విషయంలో జిల్లాలోని 44 మంది డిఫాల్ట్ మిల్లర్ల నుంచి రూ.250 కోట్ల మేర వసూలు చేయాల్సి ఉంది. పదేళ్ల నుంచి వసూలు చేయాల్సినవి సైతం ఉన్నాయి. అయితే నోటీసులిచ్చి వసూలు చేయడంలో మాత్రం అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని గత నెల 29న జరిగిన సమీక్ష సమావేశంలో అప్పటి ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే రికవరీకి ప్రక్రియ మొదలుపెట్టాలని ఆదేశించారు. అయినప్పటికీ చర్యలు ప్రారంభించలేదు. అయితే జిల్లా ఇన్‌చార్జి మంత్రి మారడంతో వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చినట్లేననే చర్చ జరుగుతోంది. కొత్త కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఈ విషయంలో అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన ఆవశ్యకత నెలకొంది.

■ నిజామాబాద్ నగరంలోని నాగారంలో 1,200 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి నాలుగేళ్లు అయినప్పటికీ ఇంతవరకు వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. దీంతో వీటిలోని శానిటరీ, ఎలక్ట్రికల్ పరికరాలు, తలుపులు, కిటికీలు చోరీకి గురయ్యాయి. మరోవైపు ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకుంటున్నాయి. వీటి మరమ్మతుల కోసం ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ చొరవతో ప్రభుత్వం నుంచి రూ.2 కోట్లు మంజూరయ్యాయి. కాగా పనులు ఇంకా మొదలు పెట్టలేదు.

✣ కీలకమైన రిజిస్ట్రేషన్ల శాఖలో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్లతో పాలన నడుస్తోంది. దీనిపైనా దృష్టి పెట్టాల్సి ఉంది.

✣ నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గత కొన్నేళ్లుగా సమస్యలు పరిష్కారం కావడం లేదు. శానిటేషన్ పనులను మూడు నెలల కిందట డీఎంఈ నరేందర్ కుమార్ ఇక్కడకు వచ్చి పరిశీలించారు. అంతకుముందు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వచ్చి స్వయంగా చూశారు. అయినా పరిస్థితి మారలేదు. జీజీహెచ్‌లో పనిచేస్తున్న వైద్యులు స్థానికంగా ఉండకపోగా, తరచూ గైర్హాజరు అవుతున్నారు. ఇక్కడ అంబులెన్స్ లేదు. ఎంఆర్ఐ స్కాన్ అందుబాటులో లేదు.



✣ మాతాశిశు సంరక్షణ కేంద్రం, క్రిటికల్ కేర్ విభాగం కొత్త భవనాల నిర్మాణం పూర్తి అయినప్పటికీ సేవలు మాత్రం ప్రారంభించలేదు. ట్రామా కేర్ సెంటర్‌కు భవనం నిర్మించినప్పటికీ పరికరాలు లేక ఆరేళ్లుగా ఆ భవనం నిరుపయోగంగా ఉంది.

✣ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పనితీరుపై అనేక విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల సమస్య మొదలైంది. మరోవైపు మందుల కొరత, క్షేత్రస్థాయిలో వైద్యులు సక్రమంగా ఉండకపోవడం, సిబ్బంది కొరత వేధిస్తోంది.


✣ ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలకు సంబంధించి ప్రతి ఏడాది వేసవి సెలవుల్లోనే మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పన చేపడుతారు. ఈ ఏడాది నిధులలేమి కారణంగా చేపట్టలేదు. సుమారు రూ.15 కోట్లు అవసరం ఉంది.

✣ నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సిబ్బంది కొరత ఎక్కువగా ఉంది. వివిధ విభాగాల్లో ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. డిప్యూటీ కమిషనర్, అదనపు కమిషనర్, డిప్యూటీ సిటీ ప్లానర్, ఎంహెచ్‌వో వంటి కీలకమైన పోస్టులు ఖాళీగా ఉన్నాయి. భవనాల నిర్మాణాలకు అనుమతులలో విచ్చలవిడి అవినీతి చోటుచేసుకుంటోంది. పన్నుల వసూళ్లలోనూ అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి.

■ జిల్లాలో ఇసుక, మొరం, మెటల్ అక్రమ రవాణా అరికట్టాల్సి ఉంది. జిల్లా సరిహద్దు ప్రాంతాలైన బోధన్ ఏరియా నుంచి అక్రమ ఇసుక రవాణా రాత్రి సమయాల్లో జోరుగా సాగుతోంది. మాక్లూర్, మోపాల్, ఎడపల్లి, ఆర్మూర్ తదితర ప్రాంతాలలో అక్రమ మొరం దందా యథేచ్ఛగా కొనసాగుతోంది.



● ధరణి పోర్టల్‌లో పరిష్కారం కాని భూసమస్యలు అనేకం ఉన్నాయి. ప్రస్తుతం భూభారతి అమలు చేస్తున్న నేపథ్యంలో కీలకమైన భూసమస్యలను పరిష్కరించాల్సిన అవసరముంది. భూ సమస్యల కారణంగా గ్రామాల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తిన సందర్భాలు ఉన్నాయి.



✣ పులాంగ్ వాగు అడుగడుగునా ఆక్రమణలతో కుచించుకుపోతోంది. దీని ఆక్రమణలను తొలగిస్తేనే నగరానికి వర్షాకాలంలో వరద ముప్పు తప్పుతుంది.

✣ విద్యాశాఖలో ఉపాధ్యాయుల గైర్హాజర్లు ఎక్కువగా ఉంటున్నాయి. మెరుగైన ఫలితాల కోసం ప్రణాళికలు సక్రమంగా అమలు కావడం లేదు. కస్తూర్బా, మోడల్ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. మధ్యాహ్న భోజన పథకం అస్తవ్యస్తంగా ఉంది. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద 760 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందుకు గాను రూ.42.38 కోట్ల నిధులు అవసరమని గుర్తించారు. వీటిలో ఇప్పటివరకు రూ.21.32 కోట్లు మాత్రమే మంజూరయ్యాయి.

ఎన్‌పీఏ తగ్గింపునకు మరింత కృషి

- ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి
- బ్యాంకు సిబ్బందికి అభినందనలు

సుభాష్‌నగర్ : బ్యాంకు నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) తగ్గింపునకు మరింత కృషి చేయాలని ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. నగరంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ రమేశ్ రెడ్డి శాఖ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. బ్రాంచీల వారీగా పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరం (2024–25) ఫలితాలు అందరి కృషికి నిదర్శనమన్నారు. రాష్ట్రస్థాయిలో ఎన్‌డీసీసీబీ అన్ని రంగాల్లో వెనకబడిపోయిందనే పేరు ఉందని, ప్రస్తుత ఫలితాలతో ఆ పేరు తొలగిపోయిందని హర్షం వ్యక్తంచేశారు. ఎన్‌పీఏను గణనీయంగా తగ్గించేందుకు శాఖ అధికారులు, సిబ్బంది అవసరమైన అన్ని రకాల చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి ఉద్యోగి తనకు తానుగా లక్ష్యాన్ని ఏర్పర్చుకొని ఆ దిశగా ప్రయత్నం చేయాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా ఇవే ఫలితాలు పునరావృతం కావాలని ఆశాభావం వ్యక్తంచేశారు. తద్వారా బ్యాంకు అన్ని విభాగాల్లో పటిష్టంగా ఉంటూ రాష్ట్రస్థాయిలో పూర్వవైభవాన్ని, శోభను కీర్తిస్తుందని తెలిపారు. ఇంతటి ఘనతను విశేషంగా కృషి చేసి, రోజువారీ కార్యక్రమాల్లో మార్గనిర్దేశం చేసిన ఉన్నతాధికారులను అభినందించి, సీఈవో నాగభూషణం వందే, ఎస్‌సీడీఆర్ వసంతను శాలువాతో సన్మానించారు. వివిధ విభాగాలు (గృహతార, స్వర్ణరత్న, రికవరీ చాంపియన్)లో ఉత్తమ ప్రతిభ చూపిన శాఖాధికారులకు జ్ఞాపికతోపాటు నగదు బహుమతి అందజేశారు. సమావేశంలో సీనియర్ బ్యాంకు అధికారులు లింబాద్రి, గజానంద్, అనుపమ, సుమమాల, 63 శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులను అభినందిస్తున్న చైర్మన్ రమేశ్‌రెడ్డి

మొక్కలు నాటే ప్రాంతాలను గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, పాల్గొన్న అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్ తదితరులు

- వన మహోత్సవం లక్ష్య సాధనకు ప్రణాళికాబద్ధంగా కృషి
- ప్లాంటేషన్‌ను ప్రాధాన్యత అంశంగా భావించాలి
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ టి వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని 545 గ్రామ పంచాయతీలు, నాలుగు మున్సిపల్ పట్టణాల పరిధిలో మొక్కలు నాటేందుకు అనువైన ప్రాంతాలను గుర్తించాలని కలెక్టర్ టి వినయ్‌కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. ప్లాంటేషన్‌ను ప్రాధాన్యత అంశంగా భావించాలని, ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని స్పష్టం చేశారు. వన మహోత్సవంపై జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఆయా శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, డీఎఫ్‌వో వికాస్‌మీనా హాజరయ్యారు. శాఖల వారీగా లక్ష్యాన్ని నిర్దేశించిన కలెక్టర్.. పూర్తిస్థాయిలో మొక్కలు నాటేందుకు కృషి చేయాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్ణీత గడువులోగా లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు సన్నద్ధమై ఉండాలన్నారు. మండల ప్రత్యేక అధికారులతోపాటు సూపర్వైజరీ అధికారులు క్షేత్రస్థాయిలో నర్సరీలను, వైకుంఠధామాలు, ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించాలని అన్నారు. నాటిన మొక్కల స్థితిగతులను పరిశీలించి వన మహోత్సవం అమలు తీరును పర్యవేక్షించాలన్నారు. ఇదివరకు నాటిన మొక్కలు స్థితిగతులపై నివేదికలు అందించాలని ఆదేశించారు. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను నాటించాలన్నారు. అటవీ శాఖ అధికారులు ప్రతి గ్రామ పంచాయతీని విధిగా సందర్శించి మొక్కల పెంపకాన్ని పరిశీలించాలన్నారు. పచ్చదనాన్ని పెంపొందించాలనే బృహత్తర సంకల్పంతో ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను వెచ్చిస్తూ ఎంతో ప్రతిష్టాత్మకంగా వన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నందున, నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని, అప్పుడే మహోత్సవం లక్ష్యం సిద్ధిస్తుందని పేర్కొన్నా రు. మొక్కల పెంపకం కోసం అందుబాటులో ఉన్న అన్ని వనరులు, కాంపోనెంట్‌లను సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా ఉపాధిహామీ కూలీలకు పని దినాలు ఎక్కువ మొత్తంలో లభించడంతోపాటు గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందన్నారు. నవంబర్ నాటికి సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. నిజామాబాద్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నర్సరీల నిర్వహణ చేపట్టాలని కమిషనర్ దిలీప్‌కుమార్‌ను ఆదేశించారు. డీఆర్డీవో సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బహిష్కరిస్తే జైలుపాలు

- రెండు గ్రామ కమిటీలకు ఇటీవల జైలుశిక్ష విధించిన కోర్టు
- చంచల్‌గూడ జైలులో కొలిప్యాక్ వీడీసీ
- సారంగాపూర్ జైలులో మునిపల్లి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు
- వీడీసీలపై కఠినంగా వ్యవహరిస్తున్న పోలీసుశాఖ
- అయినా కొన్ని గ్రామాల్లో కనిపించని మార్పు
- పంచాయితీల్లో తలదూరుస్తూ గ్రామ బహిష్కరణలు

■ భూ పంచాయితీలో తలదూర్చి తనను కులం నుంచి బహిష్కరించారని జక్రాన్‌పల్లి మండలంలోని కొలిప్యాక్ వీడీసీపై గ్రామానికి చెందిన ఎర్రోళ్ల హన్మాండ్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మొత్తం 16 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. విచారణ అనంతరం వీడీసీ సభ్యులకు ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తూ ఈనెల 3వ తేదీన జిల్లా ఎస్సీ, ఎస్టీ సెషన్స్ కోర్టు జడ్జి శ్రీనివాస్ తీర్పు ఇచ్చారు. వీడీసీ సభ్యులు ప్రస్తుతం హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులో ఉన్నారు.

■ నాయక్‌పోడ్ కులస్తులపై సామాజిక బహిష్కరణ విధించిన జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి వీడీసీ సభ్యులు 13 మంది సారంగాపూర్ సెంట్రల్ జైలులో ఊచలు లెక్కిస్తున్నారు. గ్రామంలోని శివాలయానికి వెళ్లే రోడ్డు కబ్జాకు గురైందని, తమకు దారి చూపాలని నాయక్‌పోడ్ కులస్తులు కోరగా.. 2012 నవంబర్‌లో అప్పటి సర్పంచ్ సాయిరెడ్డి, ఎంపీటీసీ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో వారిపై వీడీసీ సామాజిక బహిష్కరణ విధించింది. దీంతో నాయక్‌పోడ్ కులస్తులు జక్రాన్‌పల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఈ కేసులో 13 మందికి ఐదేళ్ల కఠినకారాగార శిక్ష విధిస్తూ ఈనెల 17వ తేదీన నిజామాబాద్ జిల్లా ఎస్సీ, ఎస్టీ సెషన్స్ కోర్టు జడ్జి శ్రీనివాస్ తీర్పు ఇచ్చారు.

ఖలీల్‌వాడి: గ్రామాభివృద్ధి పేరుతో ఏర్పడిన కమిటీలు భూ తగదాలు, కులవృత్తులు, ఇళ్ల నిర్మాణాలు తదితర పంచాయితీల్లో తలదూర్చి అమాయకులపై హుంకరిస్తే ఊచలు లెక్కించాల్సిందేననే సంకేతాలను పోలీసులు ఇస్తున్నారు. పలు గ్రామాల్లో వీడీసీ(గ్రామాభివృద్ధి కమిటీ)ల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది.

అయితే చాలా మంది బాధితులు వారి నియంతృత్వ ధోరణిని ఎదిరిస్తూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. బాధితులు భయపడకుండా తమ వద్దకు వచ్చి ఫిర్యాదు చేస్తుండడంతో పోలీసులు సైతం కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఫిర్యాదు అందిన వెంటనే విచారణ చేపట్టి కేసులు నమోదు చేస్తున్నారు. ఇప్పటికే చాలా వీడీసీలపై పీఎస్‌లలో కేసులు నమోదై ఉన్నాయి. ఇటీవల జక్రాన్‌పల్లి మండలంలోని కొలిప్యాక్, మునిపల్లి వీడీసీలు జైలుకు వెళ్లాయి. రెండు కేసుల్లో 15 రోజుల వ్యవధిలోనే కోర్టు తీర్పులు వెలువడ్డాయి.



వారు చెప్పింది శాసనం కాదు..

గ్రామాల్లో సమాంతర ప్రభుత్వం నడిపేందుకు ప్రయత్నిస్తున్న వీడీసీలు 'మేము చెప్పిందే శాసనం..' అనేలా వ్యవహరిస్తున్నా.. బాధితులు ఏ మాత్రం భయపడకుండా ప్రశ్నిస్తున్నారు. గ్రామ, కుల, సామాజిక బహిష్కరణలపై పోలీసు స్టేషన్‌లకు వెళ్తున్నారు. వీడీసీలకు సీరియస్ వార్నింగ్ ఇస్తున్న పోలీసులు.. వినవిపక్షంలో కేసులు నమోదు చేస్తున్నారు. సీపీ సాయిచైతన్య సైతం వీడీసీల ఆగడాలపై ప్రత్యేక దృష్టి సారించారు. అయితే కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ మార్పు కనిపించడం లేదని పలువురు వాపోతున్నారు. పోలీస్ స్టేషన్‌లు, కోర్టుల చుట్టూ తిరుగుతున్న వీడీసీలు.. తమ నియంతృత్వ ధోరణిని మాత్రం వదులుకోవడం లేదని, దీంతో బాధితులు చాలా మంది మానసికంగా కృంగిపోతున్నారని అంటున్నారు. కల్లు గీత కార్మికులు చెట్లు గీయాలన్నా, గొల్లకుర్మలు జీవాలను మేపాలన్నా ఇలా ఆయా కులవృత్తుల వారి నుంచి వీడీసీలు ప్రతి ఏడాది డబ్బులు వసూలు చేస్తున్నాయి.

వీడీసీలది నియంతృత్వం



వీడీసీల నియంతృత్వం కారణంగా సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. వీడీసీల్లో ఓ వర్గం పెత్తనం పెరిగిపోయింది. అణగారిన వర్గాలు, చేతివృత్తుల వారిపై ప్రతాపం చూపిస్తున్నారు. గ్రామాల్లో ఘర్షణ వాతావరణం లేకుండా అన్ని వర్గాల అభివృద్ధికి వీడీసీలు కృషి చేయాల్సి ఉంటుంది. కానీ కుల, గ్రామ, సామాజిక బహిష్కరణలు చేస్తున్నాయి. తాళ్లరాంపూర్ గీత కార్మికులపై ఆంక్షలు ఎత్తివేయాలి. దీనిపై కోర్టు ఇచ్చిన తీర్పు వీడీసీలకు గుణపాఠంగా మారుతుంది. – వి. ప్రభాకర్, సీపీఐఎంఎల్ మాస్‌లైన్, రాష్ట్రకార్యవర్గసభ్యులు

కోర్టు తీర్పు చెంపపెట్టు



వీడీసీలు రాజ్యాంగాన్ని అతిక్రమించి సమాంతరం ప్రభుత్వాలను నడుపుతున్నాయి. దీంతో వీడీసీల కారణంగా సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీడీసీలను రద్దు చేసి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. కొన్ని చోట్ల గ్రామపంచాయితీలు ఇవ్వాల్సిన అన్ని రకాల పర్మిషన్లను వీడీసీ ద్వారా కొనసాగుతున్నాయి. మునిపల్లి, కొలిప్యాక్ వీడీసీలపై కోర్టు తీర్పులు వీడీసీలకు చెంపపెట్టు. – సుధాకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి, నిజామాబాద్

క్లుప్తంగా

గిరిరాజ్ కళాశాల ఫలితాలు విడుదల

నిజామాబాద అర్బన్ : గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల ఫలితాలను విడుదల చేసినట్లు ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్, మే నెలలో నిర్వహించిన రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్షల ఫైనల్ ఫలితాలు, 1, 3, 5వ బ్యాక్‌లాగ్ సెమిస్టర్ ఫలితాలు విడుదల చేశామన్నారు. తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి సంపత్, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి శాంతాబాయి ఫలితాలను విడుదల చేసినట్లు తెలిపారు. యూజీ ఫైనలియర్‌లో 82.47 శాతం, 4వ సెమిస్టర్‌లో 50.97 శాతం, రెండో సెమిస్టర్‌లో 42.39 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు పేర్కొన్నారు.

ఇన్‌చార్జి మంత్రిని కలిసిన రూరల్ ఎమ్మెల్యే



డిచ్‌పల్లి: జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన సీతక్కను బుధవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీతక్కకు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. అనంతరం రూరల్ నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు తదితర అంశాలను మంత్రికి వివరించారు.

పీఈ సెట్‌లో రాష్ట్రస్థాయి 15వ ర్యాంకు



శ్రీజ

సిరికొండ: పీఈ సెట్‌లో మండలంలోని వర్షన్ తండాకు చెందిన బదావత్ శ్రీజ రాష్ట్రస్థాయి 15వ ర్యాంకు సాధించింది. మహబూబ్‌నగర్ జిల్లా పాలమూరు యూనివర్సిటీలో ఈ నెల 14న పీఈ సెట్ ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఎంపికైన శ్రీజ రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించింది. మండల కేంద్రంలో ఇంటర్ పూర్తిచేసిన శ్రీజ క్రీడలపై మక్కువతో పీఈ సెట్‌లో పాల్గొంది. శ్రీజ తండ్రి శివరాం సిరికొండ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో సీఆర్టీగా విధులు నిర్వహిస్తుండగా, తల్లి లలిత వ్యవసాయం చేస్తుంది.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీల నివారణకు చర్యలు చేపడదాం



సమావేశంలో పాల్గొన్న అధికారులు

బోధన్‌టౌన్(బోధన్): ట్రాన్స్‌ఫార్మర్ చోరీల నివారణకు పోలీసు, విద్యుత్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో చర్యలు చేపడదామని ఏసీపీ శ్రీనివాస్, డీఈ ముఖీద్ పేర్కొన్నారు. బోధన్‌లోని ఏసీపీ కార్యాలయంలో బుధవారం ఏసీపీ, విద్యుత్ డీఈల ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ట్రాన్స్‌ఫార్మర్లు చోరీలకు గురికాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని, సిబ్బందితో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయిస్తామన్నారు. సమావేశంలో సీఐలు వెంకటనారాయణ, విజయ్‌బాబు, విద్యుత్ శాఖ ఏఈలు పాల్గొన్నారు.

బంగారంతో పరారీ

ఖలీల్‌వాడి: ఆభరణాల తయారీకి ఇచ్చిన బంగారంతో పరారైన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదైనట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. నగరంలోని ఆర్యనగర్‌కు చెందిన శ్రీనివాస్ 18 తులాల బంగారు ఆభరణాలు చేయాలని కుమార్‌గల్లీకి చెందిన సద్గురుమూర్తి, సాయిప్రసాద్‌లకు ఫిబ్రవరిలో నగదు ఇచ్చాడు. 18 తులాల్లో 10 తులాల బంగారు ఆభరణాలు ఇచ్చి, మిగతా 8 తులాలు ఇవ్వలేదు. 15 రోజులుగా ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకొని, షాపు మూసివేశారని పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఉత్తర్వులిచ్చారు.. ఆప్షన్ మరిచారు

- జీవనభృతికి నోచుకోని బీడీ కార్మికులు
- కటాఫ్ తేదీని ఎత్తివేసినా లభించని ప్రయోజనం



జీవనభృతి దరఖాస్తులను తహసీల్దార్‌కు అందిస్తున్న బీడీ కార్మిక సంఘం నాయకులు (ఫైల్)



మోర్తాడ్ తహసీల్ కార్యాలయం ఎదుట జీవన భృతి కోసం ఆందోళన చేస్తున్న బీడీ కార్మికులు(ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): ఆసరా పథకం కింద బీడీ కార్మికులకు అందిస్తున్న జీవనభృతికి గతంలో నిర్ణయించిన కటాఫ్ తేదీ నిబంధన ఎత్తివేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కానీ, ఆన్‌లైన్‌లో నమోదుకు సంబంధించిన వెబ్‌పోర్టల్‌లో మాత్రం ఆప్షన్ ఇవ్వలేదు. ఫలితంగా అనేక మంది బీడీ కార్మికులు ఆసరా అందుకోలేకపోతున్నారు.

జిల్లాలో దాదాపు 2.50 లక్షల మంది బీడీ కార్మికులు ఉన్నారు. వీరిలో 96,264 మందికి మాత్రమే జీవనభృతి అందుతోంది. 20 వేల దరఖాస్తులు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నాయి. మరో 50 వేల మంది బీడీ కార్మికులు భృతి కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. 2014 ఫిబ్రవరి తర్వాత అనేక మంది బీడీ కార్మికులు పీఎఫ్ ఖాతాలను పొందారు. వీరందరికీ జీవనభృతి అందించాల్సి ఉంది. పథకం అమలు చేసిన సమయంలో 28 ఫిబ్రవరి 2014ను కటాఫ్ తేదీగా గత ప్రభుత్వం నిర్ణయించి ఆ తేదీలోపు పీఎఫ్ ఖాతాలు పొందినవారికే జీవనభృతి అమలు చేసింది. ఆ తర్వాత పీఎఫ్ ఖాతాలు పొందిన వారికి జీవనభృతి అందలేదు. దీంతో కటాఫ్ తేదీని సవరిస్తామని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వెల్లడించి ఉత్తర్వులను జారీ చేసింది. కానీ, ఆచరణలో మాత్రం అమలు చేయలేదు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో బీడీ కార్మికులకు ప్రయోజనం కలిగించేలా కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ప్రకటించింది. తాము అధికారంలోకి రాగానే కొత్తగా జీవనభృతి మంజూరు చేయడంతోపాటు బీడీ కార్మికులకు ఇస్తున్న రూ.2,016 కాకుండా మరో రెండు వేలు పెంచి రూ.4,016 ను ప్రతి నెలా అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. సీఎంగా రేవంత్‌రెడ్డి పదవీ బాధ్యతలను స్వీకరించి ఏడాదిన్నర గడిచినా జీవనభృతి ఊసే లేదు. కొత్త పింఛన్ల మంజూరు, డబ్బుల పెంపు విషయాల్లో స్పష్టత లేకపోవడంతో బీడీ కార్మికుల్లో అయోమయం నెలకొంది. ఇప్పటికైనా ఎన్నికల హామీని అమలు చేయాలని బీడీ కార్మిక సంఘాలు, కార్మికులు కోరుతున్నాయి.

రైతు సంక్షేమానికి కేంద్రం కట్టుబడి ఉంది

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి
- 'అమిత్ షా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న దినేశ్ పటేల్ కులాచారి

సుభాష్‌నగర్: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం దేశంలోని రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, పసుపు రైతుల చిరకాల కోరిక పసుపు బోర్డు జాతీయ కార్యాలయాన్ని జిల్లాలోనే ఏర్పాటు చేయడమే అందుకు నిదర్శనమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి పేర్కొన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు పాట్కూరి తిరుపతిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా దినేశ్ పటేల్ మాట్లాడుతూ ఎంపీ అర్వింద్ ధర్మపురి ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు పసుపు బోర్డు ఏర్పాటు చేయడమే కాకుండా చైర్మన్‌గా జిల్లాకు చెందిన పల్లె గంగారెడ్డిని నియమించారని తెలిపారు. పసుపు బోర్డు కేంద్ర కార్యాలయాన్ని కూడా జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసి పసుపు రైతులకు పెద్దపీట వేసిందన్నారు. కేంద్ర కార్యాలయాన్ని ఈ నెల చివరి వారంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. పసుపు బోర్డు ఏర్పాటుపై ప్రధాని మోదీకి, ప్రారంభోత్సవానికి వస్తున్న అమిత్ షాకు కృతజ్ఞతలు తెలిపేందుకు రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీజేపీ, కిసాన్ మోర్చా నాయకులు లక్ష్మీనారాయణ, అంతరెడ్డి హరీశ్‌రెడ్డి, పద్మారెడ్డి, కర్క గంగారెడ్డి, నక్క రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శిగా విజయ్ కుమార్



నియామకపత్రం అందుకుంటున్న విజయ్‌కుమార్

నిజామాబాద్‌నాగారం: తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శిగా విజయ్ కుమార్ నియమితులయ్యారు. నగరంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో బుధవారం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ నియామకపత్రాన్ని అందజేశారు. విజయకుమార్‌రాకతో జిల్లా బీసీ సంక్షేమ సంఘం మరింత పటిష్టమవుతుందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుస్స ఆంజనేయులు అన్నారు. నాయకులు ఆకుల ప్రసాద్, దర్శనం దేవేందర్, కరిపె రవీందర్, కొయ్యడ శంకర్, చంద్రమోహన్, శ్రీలత, చంద్రకాంత్, బగ్గలి అజయ్, సదానంద్, నారాయణరెడ్డి, సాయి బసవ తదితరులు పాల్గొన్నారు.

డీఈవో ఆఫీస్ స్థలం కోర్టుకు కేటాయించాలి

- కలెక్టర్‌ను కోరిన బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

నిజామాబాద్ లీగల్: జిల్లా కోర్టు ప్రాంగణంలో సరిపడా స్థలం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, కోర్టు పక్కనే ఉన్న పాత డీఈవో ఆఫీసు స్థలాన్ని కోర్టుకు కేటాయించాలని నిజామాబాద్ బార్ అసోసియేషన్ సభ్యులు కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డిని కోరారు. కలెక్టర్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పాత డీఈవో ఆఫీస్ స్థలం కేటాయిస్తే కోర్టు పార్కింగ్ స్థలంతోపాటు ఇతర అవసరాలకు సరిపోతుందన్నారు. స్పందించిన కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి జిల్లా జడ్జి జీవీఎన్ భరతలక్ష్మి సైతం ఈ విషయంపై చర్చించారని, త్వరలో దీనిపై అధికారులతో చర్చిస్తానని తెలిపారు. కార్యక్రమంలో బార్ సోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మామిళ్ల సాయిరెడ్డి, మాణిక్ రాజ్, ప్రభుత్వ అడ్వకేట్ మామిడాల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కమాండెంట్



కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి పూలమొక్క అందజేస్తున్న కమాండెంట్ సత్యనారాయణ

డిచ్‌పల్లి: కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన టీ వినయ్‌కృష్ణారెడ్డిని రాష్ట్ర ప్రత్యేక పోలీస్ ఏడో బెటాలియన్ డిచ్‌పల్లి కమాండెంట్ పీ సత్యనారాయణ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి..



కలెక్టర్‌ను సన్మానిస్తున్న ముప్ప గంగారెడ్డి

సుభాష్‌నగర్: కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వినయ్ కృష్ణారెడ్డిని నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. డీఎంవో గంగుబాయి, సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ అపర్ణ, గ్రేడ్-2 సెక్రటరీ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

వివాహిత ఆత్మహత్య

రెంజల్(బోధన్): మండలంలోని వీరన్నగుట్ట గ్రామానికి చెందిన వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. గ్రామానికి చెందిన భువనేశ్వరి(40) మానసిక పరిస్థితి బాగోలేక బాత్‌రూంలోని ఇనుప పైపులకు ఉరేసుకుని మంగళవారం రాత్రి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు వెంటనే నిజామాబాద్‌లోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో భువనేశ్వరి మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో పడి మరొకరు..

రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రానికి చెందిన సూదం గంగామణి (52) స్థానిక చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. భర్త మందలించాడని మనస్తాపంతో మంగళవారం ఇంట్లో నుంచి వెళ్లిపోయిన గంగామణి బుధవారం పోతంగల్ గ్రామ చెరువులో మృతదేహమై కనిపించింది. కొడుకు సతీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదృశ్యమైన యువకుడు..



హరీశ్(ఫైల్)

మాక్లూర్ : పాలానికి వెళ్లొస్తానని చెప్పి మంగళవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని అడవిమామిడిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. అడవిమామిడిపల్లికి చెందిన గంగోనె హరీశ్(34) మంగళవారం ఉదయం పొలానికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బైక్‌పై వెళ్లి సాయంత్రం వరకు తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు అదే రోజు రాత్రి హరీశ్ కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం సాయంత్రం స్థానికంగా ఉన్న అటవీ ప్రాంతంలో హరీశ్ ఓ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పశువుల కాపర్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతుడి కుటుంబసభ్యుడైన నారాయణ ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. హరీశ్ ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియలేదని వివరించారు.

గుండెపోటుతో ఒకరి మృతి

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని నాగ్లూర్ గ్రామానికి చెందిన కంది సంజీవులు(32) గుండెపోటుతో బుధవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సంజీవులు ఛాతిలో నొప్పిగా ఉందని చెప్పడంతో బంధువులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడన్నారు.


డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మూడు రోజుల జైలు

మోపాల్: మద్యం సేవించి వాహనం నడిపిన ఒకరికి కోర్టు మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. డిచ్‌పల్లి మండలంలోని ఘన్‌పూర్‌కు చెందిన మహ్మద్ నయీమ్ మద్యం సేవించి వాహనం నడుపుతూ మోపాల్ పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో అతడిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా ప్రత్యేక ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి నూర్జహాన్ బేగం మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

కరెంట్ షాక్‌తో ఒకరి మృతి

ఇందల్వాయి: కోతులను తరిమే క్రమంలో విద్యుత్ తీగలు తగిలి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని గంగారాం తండాలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్థాన్ నుంచి బతుకుదెరువు కోసం వచ్చిన భగవాన్ లాల్ గంగారం తండాలో అద్దె ఇంట్లో ఉంటూ ఐస్‌క్రీమ్ తయారు చేసి గ్రామాల్లో విక్రయించేవాడు. బుధవారం ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తుండగా కోతులు గుంపుగా రావడంతో ఐరన్ పైప్ తీసుకొని బిల్డింగ్ పైకి వాటిని తరిమే క్రమంలో పైపు 11 కేవీ విద్యుత్ తీగలకు తగలడంతో భగవాన్‌లాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య మంజులా దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పిచ్చికుక్కల దాడి.. 13 మందికి గాయాలు



బాలుడికి చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

ధర్పల్లి: ధర్పల్లి మండల కేంద్రంతోపాటు దమ్మన్నపేట గ్రామంలో బుధవారం పిచ్చికుక్కలు స్వైర విహారం చేశాయి. రెండు గ్రామాల్లో కనిపించిన వారిని కనిపించినట్లే కరుస్తూ వెళ్లాయి. పిచ్చికుక్కల దాడిలో 13 మంది గాయాలపాలయ్యారు. క్షతగాత్రులకు ధర్పల్లి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించారు. దమ్మన్నపేటలో ఇద్దరు చిన్నారుల ముఖంపై తీవ్రగాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అధికారులు స్పందించి గ్రామాల్లో పిచ్చికుక్కల బెడదను అరికట్టాలని గ్రామస్తులు కోరారు.

డివిజన్‌లోనే మొదటి ప్రభుత్వ కాలేజీ

మీకు తెలుసా?



ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల భవనం

ఆర్మూర్ డివిజన్‌లో మొట్టమొదటి ప్రభుత్వ జూనియర్ కళాశాల పిప్రి రోడ్‌లో ఏర్పాటు చేశారన్న విషయం ఎంతమందికి తెలుసు?

- 1969లో పిప్రి రోడ్డులో నెలకొల్పిన ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే జూనియర్ కళాశాలను సైతం నిర్వహించే వారు.
- 1996లో డిగ్రీ కళాశాల నుంచి వేరు చేస్తూ బాలుర జూనియర్ కళాశాలను పిప్రి రోడ్‌లో, బాలికల జూనియర్ కళాశాలను ఆర్మూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేశారు.
- 2016 విద్యా సంవత్సరంలో పిప్రి రోడ్‌లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను కో ఎడ్యుకేషన్ కళాశాలగా ప్రభుత్వం మార్చింది.
- ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను మాత్రం బాలికల కళాశాలగానే నిర్వహిస్తున్నారు.
- అదే సమయంలో ఆర్మూర్ పట్టణంలో ప్రైవేటు జూనియర్ కళాశాలలను పెద్ద ఎత్తున స్థాపించడంతోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లడానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో క్రమంగా బాలుర జూనియర్ కళాశాలలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం మానేశారు.
- ప్రస్తుతం ఈ కళాశాలలో తెలుగు మీడియంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఇంగ్లిష్ మీడియంలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులతోపాటు కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ ఒకేషనల్ కోర్సును నిర్వహిస్తున్నారు.
- అడ్మిషన్ల కోసం కళాశాల ప్రిన్సిపల్ విజయానంద్ రెడ్డిని 94408 27986 నంబర్‌లో సంప్రదించవచ్చు. – ఆర్మూర్

తన పిల్లలను ప్రభుత్వ స్కూల్‌లో చేర్పించిన ఉపాధ్యాయుడు



కూతురును ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్న ఉపాధ్యాయుడు పఠాని గంగాధర్

వేల్పూర్: వేల్పూర్ మండలం కుకునూర్ ప్రభుత్వ పాఠశాలలో తెలుగు పండితుడిగా పనిచేస్తున్న అదే గ్రామానికి చెందిన పఠాని గంగాధర్ తన కూతురు, కొడుకును అదే ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించి ఆదర్శంగా నిలిచారు. 9వ తరగతి చదువుతున్న కుమార్తె జాగృతిని హైస్కూల్‌లో, 3వ తరగతి చదువుతున్న కుమారుడు శ్రేయాన్స్‌ను ప్రైమరీ స్కూల్‌లో బుధవారం చేర్పించారు. పఠాని గంగాధర్ గతేడాది ఏడాది జరిగిన బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా సొంత గ్రామంలో, తాను చదువుకున్న పాఠశాలలో పోస్టింగ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించడం ద్వారా స్కూళ్లపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుందన్నారు. దీంతో హైస్కూల్, ప్రైమరీ స్కూళ్ల హెచ్‌ఎంలు హరిచరణ్, హరిప్రసాద్ ఆయనను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్‌రావు, మల్కన్న, సురేశ్, నాగరాజు, రవీందర్, చరణ్‌దాస్, అశోక్, నరేందర్, చంద్రశేఖర్, స్రవంతి పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినియోగంతో అనర్థం

- జిల్లా జడ్జి జీవీఎన్ భరతలక్ష్మి



పోస్టర్ విడుదల చేస్తున్న జడ్జి జీవీఎన్ భరతలక్ష్మి

నిజామాబాద్ లీగల్: మాదకద్రవ్యాల వినియోగం వలన మానవ జీవితపు నడక దారి తప్పుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీవీఎన్ భరత లక్ష్మి అన్నారు. యువత బంగారు భవిష్యత్ బాగుండాలంటే డ్రగ్స్‌ను సేవించకుండా ఉండాలన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమ రవాణా వ్యతిరేక దినం జూన్ 26 న జరుపుకోనున్న నేపథ్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలోని తన చాంబర్‌లో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ రూపొందించిన జీవితంలో డ్రగ్స్‌కు నో చెప్పడం ఎలా..? అంశంపై గోడ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్ భాస్కర్ రావు, జిల్లా అదనపు పోలీస్ కమిషనర్ బస్వారెడ్డిలు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి కృషి చేయాలి

- కలెక్టర్‌ను కలిసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కలెక్టర్ టీ వినయ్‌కృష్ణారెడ్డికి విజ్ఞప్తి చేశారు. బుధవారం కలెక్టర్‌ను ఎమ్మెల్యే ధన్‌పాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో సంక్షేమ పథకాల అమలు, నగరాభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మీనారాయణ, నాయకులు ప్రభాకర్, ఆనంద్, పవన్ ముందాడ, కృష్ణ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో రోడ్ల విస్తరణ, ఇతర అభివృద్ధి పనుల్లో జాప్యానికి తావులేకుండా భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ టి వినయ్‌కృష్ణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్ల విస్తరణ, రైల్వే పనులు, నీటి పారుదల, జాతీయ రహదారులు, పరిశ్రమల స్థాపన తదితర వాటికి అవసరమైన భూసేకరణపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాలులో శాఖల వారీగా కలెక్టర్ బుధవారం సమీక్ష నిర్వహించారు. భూసేకరణ ప్రక్రియకు సంబంధించి రైతులతో సంప్రదింపులు జరుపుతూ, నష్టపరిహారం నిర్ణయంలో సానుకూల ధోరణిని అవలంబించాలని సూచించారు. నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తూ పెండింగ్‌లో ఉన్న అప్పీల్‌లను వేగంగా పరిష్కరించాలని అన్నారు. వారం తరువాత మళ్లీ సమీక్షిస్తామని, స్పష్టమైన ప్రగతి కనిపించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, మెప్మా పీడీ రాజేందర్, కలెక్టరేట్ పర్యవేక్షకుడు భాస్కర్, రైల్వే, ఆర్అండ్‌బీ, జాతీయ రహదారులు, ఇరిగేషన్, టీజీఐఐసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఆర్‌ఎంపీపై దాడి కుట్రలో భాగమే'




మాట్లాడుతున్న రాజాగోపాల్ చారి


నిజామాబాద్‌నాగారం: డిమాండ్ల సాధన కోసం చేపట్టిన ర్యాలీలో జరిగిన దాడి సంఘటన కుట్రలో భాగమేనని బోధన్ ఆర్‌ఎంపీ, పీఎంపీల అసోసియేషన్ అధ్యక్షుడు రాజాగోపాల్ చారి పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాంతియుతంగా నిర్వహిస్తున్న ర్యాలీలో జరిగిన సంఘటన తమకు ఆందోళన కలిగించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో పేర్కొన్న విధంగా 429 జీవో ప్రకారం గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇప్పించి, వైద్యులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాలలో ఆర్‌ఎంపీ పీఎంపీలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తమలోని ఐక్యతను చూసి ఓర్వలేని కొందరు శాంతియుతంగా చేస్తున్న ర్యాలీని భగ్నం చేసేందుకు కుట్ర పూరితంగా మహిళను రెచ్చగొట్టి తమపైకి ఉసిగొల్పారని ఆరోపించారు. తామంతా డాక్టర్ అశోక్‌కు మద్దతుగా జిల్లా సీపీకి ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. విలేకరుల సమావేశంలో ఆర్మూర్ శ్రీనివాస్, చందు, సాయిలు, ఖలీల్, అజార్, మోస్రా గంగారెడ్డి, బొద్దుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి గుంతలో పడిన కారు


- ప్రమాదంలో ఇద్దరు మృతి
- ముగ్గురి పరిస్థితి విషమం



పీర్యా (35)



డ్రైవర్ పీర్యా (32)



పోచారం కాలువ బ్రిడ్జి గుంతలో పడిన కారు

ఎల్లారెడ్డిరూరల్: మల్లయ్యపల్లి శివారులో పోచారం ప్రధాన కాలువపై నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి గుంతలో కారు ప్రమాదవశాత్తూ పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని నర్సింగ్‌రావుపల్లి తండాకు చెందిన పీర్యా తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం రాత్రి నిజామాబాద్ జిల్లా పెద్దగుట్టకు కారులో వెళ్తుండగా మల్లయ్యపల్లి వద్ద పోచారం కాలువ బ్రిడ్జి నిర్మాణ గుంతలో పడింది. పెద్దగుట్టలో శుక్రవారం రోజున కందూరు చేసుకునేందుకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా పీర్యా తన తమ్ముడు వేణుతో పాటు ఇద్దరు కుమారులు సోను, ప్రవీణ్‌లతో పాటు డ్రైవర్‌ను వెంట తీసుకుని వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటనలో డ్రైవర్ పీర్యా(32) అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు 108కు సమాచారం అందించడంతో నలుగురిని ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. ఆస్పత్రిలో పీర్యా(35) మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వేణు, సోను, ప్రవీణ్‌ల పరిస్థితి సైతం విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

COMPUTER EDUCATION

■ గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత వసతితో కంప్యూటర్ శిక్షణ + ఉద్యోగం Age: 18-30 yrs / SSC Pass, Last Date: 25-06-25, NZB. 9014569553. [SCA25005075]

SERVICES

సిరి అసోసియేట్స్

■ సిరి అసోసియేట్స్ హౌస్ మార్టిగేజ్ పర్సనల్ ఓపెన్ ప్లాట్స్ రేకుల & గుణపెంకు ఇళ్లపై సిబిల్ లేకున్నా రుణాలు ఇప్పించబడును. సెల్: 9666142226. [SCA25005069]

CHANGE OF NAME

■ I, Nathi Vinod Kumar F/o. Nathi Gignasa (Old Name) R/o. 7-12, Chengal (V), Bheemgal(M), Nizamabad (D), I have changed my daughter's name as Nathi Gignasa Kishor Goud(New Name) D/o. Nathi Vinod Kumar [SCA25005162]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

WANTED

■ Wanted Teachers for Higher Classes Fluency in English is Essential Interested Contact Immediately St. Xaviers High School, Opp: forest Office, Varni Road, Nizamabad. 8639189010. [Z-7143]

■ ప్రముఖ MNC కంపెని ఆఫీస్‌లో వర్క్ చేయుటకు అనుభవం గల స్త్రీ / పురుషులు కావలెను. అర్హత 10th - డిగ్రీ జీతం 20 వేలు నుంచి. Ph: 99084 29239. [SCA25004985]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/- రూ॥లు
ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.